ఎన్నాళ్లీ సమస్య?

రహదారులపై పారుతున్న మురుగునీరు ● డంపింగ్‌యార్డులా బహిరంగ ప్రదేశం

ద్వారకానగర్‌కాలనీని పట్టించుకోని జీహెచ్‌ఎంసీ



ద్వారకానగర్‌కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు



కాలనీలోని బహిరంగ ప్రదేశంలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

హస్తినాపురం: మురుగుతో పొంగిపొర్లుతున్న రహదారులు.. దుర్గంధం వెదజల్లుతున్న కాలనీలు.. పట్టించుకోని అధికారులు.. ఇదీ ఎల్‌బీ నగర్ సర్కిల్ హస్తినాపురం డివిజన్ పరిధిలోని ద్వారకానగర్ కాలనీలో దాదాపు నెల రోజులుగా ఉన్న పరిస్థితి. స్థానికంగా నెలకొన్న సమస్యలపై అటు అధికారులు.. ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని రోజులుగా కనీసం రోడ్లపై నడవలేకున్నామని చెబుతున్నారు. జలమండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్నారు. మురుగునీటికి తోడు కాలనీలోని బహిరంగప్రదేశంలో వ్యర్థాలు వేస్తూ డంపింగ్ యార్డుగా తయారు చేశారన్నారు. ఫలితంగా దోమల బెడద ఎక్కువైందని.. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కాలనీ నూతన సంక్షేమ సంఘం

హస్తినాపురం: ద్వారకానగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఆదివారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా పాల్వాయి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి జక్క దామోదర్‌రెడ్డి, కోశాధికారి కొల్లు నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

వెంటనే చర్యలు తీసుకోవాలి..



ద్వారకాన గర్‌కాలనీలోని సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలి. కాలనీలోని బహిరంగ ప్రదేశంలో చెత్తకుప్పలు వేయడం వల్ల డంపింగ్ యార్డులా మారింది. దీంతో దోమలు ఎక్కువయ్యాయి. అంటువ్యాధులు వ్యాపిస్తాయేమోనని భయంగా ఉంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి. – పాల్వాయి శ్రీనివాస్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు, ద్వారకానగర్ కాలనీ

దుర్గంధం వ్యాపిస్తోంది..



సర్కిల్ అధికారులు జోక్యం చేసుకుని కాలనీలోని మురుగు సమస్యను పరిష్కరించాలి. నెలరోజులుగా మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు పొంగుతోంది. కాలనీ మొత్తం దుర్గంధం వ్యాపిస్తోంది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదు.

– కొల్లు నర్సింహారెడ్డి, ద్వారకానగర్ కాలనీ సంఘం కోశాధికారి

ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి..



ఇతర ప్రాంతాల నుంచి చెత్త తీసుకువచ్చి కాలనీలోని బహిరంగ ప్రదేశంలో డంపింగ్ చేస్తున్నారు. అయితే, ఇక్కడి చెత్త మాత్రం తరలించడం లేదు. దీంతో దోమలు చేరుతున్నాయి. సమస్యపై ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జోక్యం చేసుకొని తక్షణ పరిష్కారం చూపాలి. – జక్క దామోదర్‌రెడ్డి, ద్వారకానగర్‌కాలనీ సంఘం ప్రధాన కార్యదర్శి

పాతబస్తీలో 'మెట్రో'కు శంకుస్థాపన చేయండి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ అసదుద్దీన్ విజ్ఞప్తి



ఐఎస్‌సదన్‌లో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్

సైదాబాద్: అసెంబ్లీ సమావేశాల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి పాతబస్తీలో మెట్రో రైల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కోరారు. సోమవారం యాకత్‌పురా నియోజకవర్గం ఐఎస్‌సదన్ డివిజన్‌లో రూ.30 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన రహదారుల పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డితో కలిసి ఎంపీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎలక్షన్ నోటిఫికేషన్ రాకముందే ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నామా వరకు మెట్రో నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేయాలని కోరారు. అదేవిధంగా మీరాలంట్యాంక్ వద్ద నిర్మించిన ఎస్టీపీని ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. హెచ్‌ఎండీఏకు తాను ప్రతిపాదించినట్టు నౌ నంబర్ మహ్మదాబాద్ నుంచి మీరాలం చెరువు మీదుగా శాస్త్రీపురం వరకు బ్రిడ్జి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలన్నారు. నిత్యం వేలాది మంది టూరిస్టులు వచ్చే చార్మినార్, లాడ్‌బజార్‌ల వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పిస్తే ఇక్కడ టూరిజం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. తాను ప్రతిపాదించిన విషయాల్లో ప్రభుత్వం చొరవ చూపాలని ఎంపీ కోరారు. కార్యక్రమంలో యాకత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ పాల్గొన్నారు.

'ఎన్టీఆర్‌నగర్ బస్తీ కష్టాలు తీరుస్తాం'



లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న భాస్కర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: పేదలుండే బస్తీలను తీర్చిదిద్దుతామని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ వాసులు లక్ష్మారెడ్డిని సోమవారం కలిశారు. ఇళ్ల పట్టాలను రెగ్యులర్ చేస్తామని ఏళ్లుగా నాయకులు హామీ ఇస్తున్నా నేటికీ ఫలితం లేదని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన లక్ష్మారెడ్డి త్వరలోనే సమస్యపై అధికారులతో మాట్లాడతానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పున్నా గణేశ్ నేత, నిర్మల, ప్రధాన కార్యదర్శి ఎన్టీఆర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ దుబ్బాక శేఖర్, డేక్యార్ నాయక్, అల్లావుద్దీన్ పటేల్, ఫరీద్ బాషా, మహమ్మద్ షఫీ, హైమద్, సోమేశ్వరరావు, జి.రమేశ్‌గౌడ్, ఎ.కిరణ్ కుమార్, అక్బర్, నభి, కల్యాణ్, భాస్కర్ నాయక్, హరి నాయక్, రవి నాయక్, ప్రేమ్ నాయక్ పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనుల పరిశీలన

చంపాపేట: మంచినీటి పైపులైన్ ఏర్పాటుతో తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నట్టు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పోచమ్మగడ్డ, మారుతీనగర్ కాలనీలలో కొనసాగుతున్న మంచినీటి పైపులైన్ పనులను జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా మంచినీటి పైపులైన్ లేక కాలనీల ప్రజలు ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. పలుమార్లు అధికారులతో చర్చించిన తర్వాత నూతన పైపులైన్స్ మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రమ్యభారతి, మిహ్మాజ్, కాలనీల ప్రజలు రమేశ్, నవీన్‌కుమార్, రఘునందన్‌రెడ్డి, నర్సింహాచారి, సుధాకర్, రాంచందర్, రవికుమార్, శ్రీనివాస్ తదితరులున్నారు.



అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

హైదరాబాద్ ఎంపీ స్థానం మాదే

బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి



పోస్టర్ విడుదల చేసిన సురేందర్‌రెడ్డి

సైదాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని బీజేపీ గెలవడం ఖాయమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సైదాబాద్ రెడ్డిబస్తీలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన పార్టీ విజయ సంకల్ప యాత్ర పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 19న భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రారంభమైన బీజేపీ విజయ సంకల్ప యాత్ర 28న హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోకి ప్రవేశిస్తుందన్నారు. అదేరోజు పాతబస్తీలోని నాలుగు ఎమ్మెల్యే నియోజకవర్గాల పరిధిలో యాత్ర సాగుతుందని తెలిపారు. యాత్రలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సహా పార్టీ ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, సహదేవ్ యాదవ్, వీరేంద్రబాబు యాదవ్ పాల్గొన్నారు.

పేదింట పెళ్లికి సహాయం

నాగోలు: నిరుపేద కుటుంబాలకు అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ అండంగా ఉంటుందని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. లక్ష్మీదేవిపల్లికి చెందిన అబ్బాయి, నిజామాబాద్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన రాధిక వివాహం కోసం సోమవారం నాగోలులోని శ్రీనివాస్‌ని కలిశారు. ఈ సందర్భంగా వారికి ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళసూత్రం, మెట్టెలు, చీర, గాజులు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ.. అన్ని కులాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు సహాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు మాదిశెట్టి సదానందం గుప్త, యాద శ్రీనివాస్, తోట శ్రవణ్‌కుమార్, సందీప్ గుప్తా, వర్మ, నవీన్ పాల్గొన్నారు.



యువతికి పుస్తెలు, మెట్టెలు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్త

పెండింగ్ వేతనాలు చెల్లించండి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిషన్



కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కిషన్ తదితరులు

మీర్‌పేట: కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.కిషన్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులతో కలిసి మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి, అనంతరం కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం 25 మంది కార్మికులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకుని, రెగ్యులర్ కార్మికుల వలె వేతనాలు ఇవ్వకుండా శ్రమదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, పాలకవర్గం జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే అందజేయాలని.. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.యాదయ్య, యాదగిరిచారి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.జె.ప్రకాశ్‌కారత్, ప్రకాశ్‌రెడ్డి, దాసరి బాబు, కార్మికులు సీహెచ్.యాదగిరి, భారతమ్మ, బావమ్మ, నర్సింహ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయండి

బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు నర్సింహ

మీర్‌పేట: శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపట్టాలని బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో కలిసి కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లెలగూడ సాయినగర్ శ్మశాన వాటిక అభివృద్ధికి రెండేళ్ల క్రితం రూ.కోటి నిధులు మంజూరు చేసినా నేటికీ పనులు ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్నానాల గదులు లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్‌కు వివరించారు. వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు గాజుల మధు, సోమేశ్వర్, కార్పొరేటర్లు, భిక్షపతిచారి, భీంరాజ్, హరినాథ్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, బుచ్చిరాములు తదితరులున్నారు.

మార్చి 1న 'ఎన్జీఓస్' సర్వసభ్య సమావేశం

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీఓస్ కాలనీ సంక్షేమ సంఘం అత్యవసర సర్వసభ్య సమావేశం మార్చి 1న జరగనుంది. కాలనీలోని జలగం వెంగళరావు కమ్యూనిటీహాల్‌లో ఉదయం 10.30 గంటలకు సమావేశం ఉంటుందని సంఘం అధ్యక్షుడు జి.పేరంటాలయ్య, ప్రధాన కార్యదర్శి సోమయాజులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దీపాదాస్ మున్షీని కలిసిన నాయకులు



దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, పున్న గణేశ్, ధన్‌రాజ్ గౌడ్ తదితరులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.


సూర్యోదయకాలనీ కమిటీ ఎన్నిక



నర్సింహారెడ్డిని అభినందిస్తున్న కాలనీపెద్దలు

మన్సూరాబాద్: డివిజన్ పరిధి సూర్యోదయ కాలనీ సంక్షేమ సంఘం ఆదివారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా కె.నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు కొంగరి నర్సింహారావు, మధుసూదన్‌రెడ్డి, గోపి, ప్రేమ్‌చందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు రామధర్మారెడ్డి, కృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీలు సత్యనారాయణ, రవికుమార్, ధనలక్ష్మి ఎన్నికయ్యారు.

మొగులయ్యకు సత్కారం



చైతన్యపురి: పన్నెండు మెట్ల కిన్నెర కళాకారుడు దర్శనం మొగులయ్య సోమవారం సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సీఐ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొగులయ్యను సీఐ, ఎస్సైలు ఘనంగా సత్కరించారు. మొగులయ్యకు భారతప్రభుత్వం 2022లో పద్మశ్రీ పురస్కారం అందించడం తెలంగాణకే గర్వకారణమని ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ తెలిపారు.

అంతర్గత రోడ్ల సుందరీకరణకు చర్యలు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

మలక్‌పేట: ప్రధాన రహదారులతో పాటు డివిజన్‌లోని అంతర్గత రోడ్లను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శాలివాహననగర్‌లో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, కాలనీవాసులు అశోక్, నందు, బీజేపీ నాయకులు సురేందర్, కొప్పుల దినేశ్, నరేందర్, సంతోశ్, సందీప్ తదితరులున్నారు.

శుభాకాంక్షలు



నాగోలు: రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమితులైన కె.శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం ఎస్టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు యాసాని కరుణాకర్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'దుద్దిళ్ల'కు దక్కిన గౌరవం ఇది



మాట్లాడుతున్న ఫెడరేషన్ నాయకులు

నాగోలు: దివంగత నేత, మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడంపై ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ కార్యదర్శి తులసి శ్రీనివాస్, బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి నందిరాజు లక్ష్మి నారాయణ, భాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ ప్రధాన కార్యదర్శి దుద్దు సుబ్రహ్మణ్యం, తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రిజనల్ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కొత్తపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. బ్రాహ్మణ సంఘం నాయకులు, దివంతనేత దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మార్చి 2వ తేదీన జయంతిని నిర్వహించాలని ప్రకటించడం శుభపరిణామం అన్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ వారణాసి వంశీ, ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు రవికుమార్, సంఘం సలహాదారులు వెంటప్రగడ, చింతపల్లి మంగపతిరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం కేటాయించిన భూమి జోలికి రావద్దు

పహాడీషరీఫ్: స్వాతంత్ర సమరయోధుడికి ప్రభుత్వం కేటాయించిన భూమిని పేదలకు పంచుతామని కాంగ్రెస్ నాయకులు పేర్కొనడం సరికాదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 225/2, 231/2లోని 9.09 ఎకరాల భూమిలో కాంగ్రెస్ నాయకుల భూమి అంటూ ఇళ్లపై రాసిన ఘటనపై స్వాతంత్ర సమరయోధుడు నాగభూషణం భార్య లలిత, కుమారుడు సు. దీర్ భూషణ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ విషయమై పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని సూచించారని వెల్లడించారు. నాగభూషణంకు 1961లో అప్పటి ప్రభుత్వం ఈ సర్వే నంబర్లలో 9.09 ఎకరాల భూమిని కేటాయించిందని, స్థలానికి సంబంధించి పాసు బుక్ ఉందన్నారు. ఫ్రీడం ఫైటర్ భార్యగా తాను పెన్షన్ తీసుకుంటున్నానని లలిత తెలిపారు. అప్పటి నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ధరణి వచ్చాక మాత్రం రికార్డుల్లో తమ పేరు కనిపించడం లేదన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు అర్జీ పెట్టుకున్నామని తెలిపారు.

నిధులు విడుదల చేయాలి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఎస్‌జీఎఫ్ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని బీఆర్‌ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రసిడెంట్ షర్ఫుద్దీన్ హామెద్, అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ రవూఫ్ కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఎర్రకుంటలో విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి సబితారెడ్డి కోట్లాది రూపాయలు వెచ్చించి మున్సిపాలిటీ రూపురేఖలే మార్చారన్నారు. ఇది గమనించిన కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ జల్‌పల్లిలో ఎలాంటి అభివృద్ధి జరగలేదనడం సరి కాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మంజూరు చేసిన రూ.25 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్/సరూర్‌నగర్/వనస్థలిపురం: రైతుబజార్‌లలో కూరగాయల ధరలు టమోట లోకల్ రూ.13, వంకాయ రూ.23, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.45, కాకర రూ.45, బీర రూ.35, క్యాలీఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.28, క్యారెట్ రూ.25, దొండ రూ.38, ఆలు రూ.22, ఉల్లి రూ.24, గోకర రూ.40, దోస రూ.21, సొర రూ.11, పొట్ల రూ.18, అరటి రూ.09, చిక్కుడు రూ.45, అర్వి రూ.45, మునగ రూ.45, చిలగడదుంప రూ.57, బీట్‌రూట్ రూ.25, కీర రూ.25, ఫ్రెంచ్‌బీన్స్ రూ.45, కాప్సికమ్ రూ.55. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

చైతన్యపురి: దక్షిణ షిర్డీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు శ్రీ షిర్డీ సాయిబాబా పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆయల చైర్మన్ గుండ మల్లయ్య సోమవారం తెలిపారు. మొదటి రోజు సాయంత్రం యాగశాల ప్రవేశం, రాత్రి 9 గంటలకు శేజ్ హారతి ఉంటుందన్నారు. బుధవారం ఉదయం 7.30 గంటలకు 108 కలశ స్థాపన, ఆవాహన పూజ, సాయంత్రం 5 గంటలకు మండప పూజ, సుదర్శన హోమం, నీరాజన మంత్ర పుష్పములు, గురువారం ఉదయం 7.30 గంటలకు మహాపూర్ణాహుతి, శిఖరాభిషేకం, దేవాలయ సంప్రోక్షణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ముగ్గురు సైదాబాద్ ఎస్సైలు బదిలీ

సైదాబాద్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ముగ్గురు ఎస్సైలను నగర పోలీస్ కమిషనర్ సోమవారం బదిలీ చేశారు. మాలవత్ మోజీరాం పంజగుట్ట ట్రాఫిక్ పీఎస్‌కు, పి.వెంకట్‌రెడ్డి దోమల్‌గూడ పీఎస్‌కు, బి.అమర్‌నాథ్ ఖైరతాబాద్ పీఎస్‌కు బదిలీ అయ్యారు. పంజగుట్ట ట్రాఫిక్ పీఎస్ ఎస్సై బోయ ఆంజనేయులు, దోమలగూడ పీఎస్ ఎస్సై నాగిశెట్టి సాయికృష్ణ, మార్కెట్ పీఎస్ ఎస్సై వై.లక్ష్మయ్య సైదాబాద్ పీఎస్ బదిలీపై వచ్చారు.

చాదర్‌ఘాట్ సీఐ బదిలీ..

చాదర్‌ఘాట్: ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్‌రెడ్డిని బదిలీ చేస్తూ నగర కమిషనర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయన సర్వీసులను మల్టీజోన్–2కు సరెండర్ చేశారు. గోపాలపురం ట్రాఫిక్ పీఎస్ సీఐ సంధ్యాల సైదులు చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై రానున్నారు.

నాయకులను కలిసిన త్రిపుర గవర్నర్



ఎల్‌బీనగర్: త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి సోమవారం వనస్థలిపురంలో కేంద్ర హార్టికల్చర్ బోర్డు డైరెక్టర్ వనపల్లి శ్రీనివాస్‌రెడ్డిని ఆయన ఇంట్లో కలిశారు. గతంలో బీజేపీలో తన కలిసి పని చేసిన నాయకులతో కాసేపు ముచ్చటించి ఫొటోలు దిగారు.

ప్రజావాణికి మూడు ఫిర్యాదులు



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు అందినట్టు అధికారులు తెలిపారు. అవి కూడా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించినవే అని అధికారులు చెప్పారు. మరోవైపు సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో రెండు, ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో రెండు, హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో మూడు ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ హాస్టళ్ల సమస్యలపై వినతి

నాగోలు: రాష్ట్ర వ్యాప్తంగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖలోని పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్, కాలేజీ హాస్టల్స్, ప్రీ మెట్రిక్ హాస్టల్స్, స్కూల్ హాస్టల్స్‌లో సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్సీ స్టూడెంట్ హాస్టల్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.సాయికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ జీఓలు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆరోపించారు. విద్యార్థులకు తక్షణమే డైట్‌చార్ట్ జీఓను విడుదల చేయడంతో పాటు ప్రతి హాస్టల్‌లో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలని కోరారు. అంతేకాకుండా రాష్ట్రంలో వివిధ హాస్టల్స్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వంట మనిషి అదృశ్యం

సైదాబాద్: ప్రైవేట్ హాస్టల్‌లో వంట చేసే యువకుడు అదృశ్యమైనట్టు సైదాబాద్ పోలీసులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు..ఒడిశా రాష్ట్రానికి చెందిన గణేశ్ నాయక్, సత్య నాయక్ (20) సోదరులు. ఇద్దరూ ఏడాదిగా గడ్డిఅన్నారంలోని ఓ ప్రైవేట్ బాయ్స్ హాస్టల్‌లో వంట పని చేస్తున్నారు. ఈనెల 21న సత్యనాయక్‌ను స్థానికంగా ఉన్న ఒక హోటల్ వద్ద ఉండమని చెప్పి గణేశ్‌నాయక్ దిల్‌సుఖ్‌నగర్ వెళ్లి వచ్చాడు. అయితే, అక్కడ సత్యనాయక్ కనిపించలేదు. దీంతో హాస్టల్‌లో స్నేహితుల వద్ద విచారించినా అతని ఆచూకీ దొరకలేదు. సొంత ఊరికి వెళ్లాడేమోనన్న అనుమానంతో విచారించినా ఫలితం లేదు. దీంతో గణేశ్ నాయక్ ఆదివారం సైదాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

డీసీఎం డ్రైవర్ ఆత్మహత్య

నాగోలు: అనుమానాస్పద స్థితిలో డీసీఎం డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగోలు పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. తట్టిఅన్నారంలో నివాసం ఉండే అబ్దుల్‌రహీం(35) డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లతో కలసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. దంపతుల మధ్య గొడవలు జరుగుతుండటంతో కొంత కాలం క్రింత భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే, పిల్లలను రహీం తన తల్లి రంజాన్బీని ఇంటికి తీసుకొచ్చాడు. ఆమె కొత్తపేటలోని ఓ హాస్పిటల్ పని మనిషిగా ఉంటోంది. సోమవారం ఉదయం రంజాన్బీ డ్యూటికి నుంచి 2:30 గంటల సమయంలో ఇంటికి వచ్చింది. తలుపు తీయాలని ఎన్నిసార్లు పిలిచిన రహీం నుంచి స్పందన లేదు.. అతనికి ఫోన్ చేసినా ఫలితం లేదు. దీంతో చుట్టుపక్కల వారి సహాయంతో తలుపు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా రహీం చున్నీతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. రహీం తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా, 'సూసైడ్ చేసుకుంటున్నా.. క్షమించు అంటూ' రాసి ఉన్న నోట్‌ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9912220363
9505507616 9912220365